# కొలొస్సయులకు
# వ్రాసిన పత్రిక

1 దేవుని చిత్తాన్ని బట్టి క్రీస్తు యేసు అపొస్తలుడైన పౌలు, మన
సహోదరుడైన తిమోతి శుభమని చెప్పి వ్రాయునది:
2 కొలొస్సయిలో ఉన్న దేవుని పరిశుద్ధ ప్రజలకు, క్రీస్తులో
విశ్వాసులైన సహోదరీ సహోదరులకు,

మన తండ్రియైన దేవుని* నుండి మీకు కృపా సమాధానాలు
కలుగును గాక.

## కృతజ్ఞత ప్రార్థన

3-4 క్రీస్తు యేసులో మీరు కలిగి ఉన్న విశ్వాసం గురించి, దేవుని
ప్రజలందరి పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ గురించి మేము విన్నాము,
కాబట్టి మేము మీ కోసం ప్రార్థన చేసినప్పుడెల్లా, మన ప్రభువైన యేసు
క్రీస్తుకు తండ్రియైన దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాము.
5 మీ దగ్గరకు వచ్చిన సువార్త అనే సత్య బోధలో మీరు విన్న,
పరలోకంలో మీ కోసం దాచి ఉంచిన నిరీక్షణ నుండి విశ్వాసం ప్రేమ
కలిగాయి.
6 అదే విధంగా, మీరు సువార్తను విని, దేవుని కృప గురించి
నిజంగా గ్రహించిన రోజు నుండి అది మీ మధ్యలో ఫలించి
వృద్ధి చెందుతున్న ప్రకారమే, ఈ సువార్త లోకమంతా ఫలిస్తూ
వృద్ధిచెందుతుంది.
7 మా ప్రియ తోటి సేవకుడైన ఎపఫ్రా నుండి వీటిని మీరు
నేర్చుకున్నారు, అతడు మా విషయంలో క్రీస్తు యొక్క నమ్మకమైన
పరిచారకుడు.
8 ఆత్మలో మీకున్న ప్రేమను కూడా అతడు మాకు తెలియజేశాడు.

* **1:2** కొ.ప్ర.లలో తండ్రి ప్రభువైన యేసు క్రీస్తు

9 ఈ కారణంగా, మీ గురించి విన్న రోజు నుండి, మేము మీ కోసం
మానక ప్రార్థిస్తున్నాము. మీరు ఆత్మ ఇచ్చే సంపూర్ణ జ్ఞానం, వివేకం
ద్వారా ఆయన చిత్తాన్ని పరిపూర్ణంగా గ్రహించినవారై,
10 ప్రతి మంచి పనిలో సఫలమవుతూ, దేవుని జ్ఞానంలో
ఎదుగుతూ అన్ని విషయాల్లో ప్రభువును సంతోషపెడుతూ ఆయనకు
తగినట్లుగా జీవించాలని,
11 మీరు ఆనందంతో కూడిన పరిపూర్ణమైన ఓర్పును, సహనాన్ని
కలిగి ఉండేలా, ఆయన మహిమ ప్రభావాలను బట్టి సంపూర్ణ శక్తితో
మీరు బలపరచబడాలని దేవున్ని నిరంతరం వేడుకుంటున్నాము.
12 వెలుగు రాజ్యంలో పరిశుద్ధ ప్రజల స్వాస్థ్యంలో
పాలుపంచుకోవడానికి, మిమ్మల్ని ఎన్నికచేసిన తండ్రికి
కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాము.
13 ఆయన మనల్ని అంధకార సంబంధమైన అధికారంలో నుండి
విడిపించి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యంలోనికి
మనల్ని తీసుకువచ్చారు.
14 ఆ కుమారుని ద్వారా మనకు విడుదల, పాపక్షమాపణ
కలుగుతుంది.

## క్రీస్తు యొక్క సర్వాధికారం

15 కుమారుడు అదృశ్య దేవుని స్వరూపం, సృష్టంతటి కంటే
మొదట జన్మించిన వాడు.
16 ఎందుకనగా, ఆయనలోనే సమస్తం సృష్టించబడ్డాయి,
అనగా: ఆకాశంలో ఉన్నవి, భూమిపై ఉన్నవి, కంటికి కనబడేవి
కనబడనివి, సింహాసనాలైనా లేదా ప్రభుత్వాలైనా లేదా పాలకులైనా
లేదా అధికారులైనా, సమస్తం ఆయన ద్వారానే ఆయన కొరకే
సృష్టించబడ్డాయి.
17 ఆయన అన్నిటికంటే ముందుగా ఉన్నవాడు, సమస్తానికి
ఆయనే ఆధారము.

18 సంఘమనే శరీరానికి ఆయనే శిరస్సు, ఆయనకు అన్నిటిలో
సర్వాధికారం కలిగి ఉండడానికి ఆయనే ఆరంభం, మృతులలో నుండి
లేచుటలో ప్రథముడయ్యారు.
19 ఆయనలో దేవుని సంపూర్ణత నివసించాలని తండ్రి యొక్క
దేవుని ఉద్దేశం.
20 ఆయన ద్వారా సమస్తాన్ని అనగా, భూమిపై ఉన్న లేదా
పరలోకంలో ఉన్న, అన్నిటిని, క్రీస్తు సిలువలో కార్చిన రక్తం ద్వారా
రాజీపరచి, క్రీస్తు ద్వారా తనలో సమాధానపరచుకోవడం తండ్రికి
ఇష్టమైనది.

21 ఒకప్పుడు మీరు దేవుని నుండి దూరం అయ్యారు, మీ దుష్ట
ప్రవర్తన వలన మీ మనస్సులో విరోధులయ్యారు.
22 అయితే, దేవుడు మిమ్మల్ని పరిశుద్ధులుగా నిర్దోషులుగా
నిరపరాధులుగా తన సన్నిధిలో నిలబెట్టడానికి యేసు యొక్క
భౌతికమైన శరీరం మరణించుట ద్వారా ఇప్పుడు మిమ్మల్ని
సమాధానపరిచారు.
23 అందువల్ల మీరు విశ్వాసంలో కొనసాగుతూ స్థిరంగా
నిలబడి, సువార్తలో చెప్పబడిన నిరీక్షణలో నుండి తొలగిపోకుండా
ఉండండి. మీరు విన్న ఈ సువార్త, ఆకాశం క్రింద ఉన్న సమస్త
సృష్టికి ప్రకటించబడుతుంది, పౌలు అనే నేను ఆ సువార్తకు
సేవకుడినయ్యాను.

## సంఘం కోసం పౌలు పరిచర్య

24 మీ కోసం నేను అనుభవిస్తున్న శ్రమలలో ఇప్పుడు నేను
సంతోషిస్తున్నాను, సంఘమనే ఆయన శరీరం కోసం క్రీస్తు పడిన
బాధల్లో మిగిలి ఉన్న వాటిలో నా వంతును, నా శరీరంలో పూర్తి
చేస్తున్నాను.

25 మీకు దేవుని వాక్యాన్ని సంపూర్ణంగా తెలియజేయడానికి,
దేవుడు నాకు అప్పగించిన బాధ్యతను బట్టి సంఘానికి
సేవకుడినయ్యాను.
26 దేవుని వాక్యం అనగా గత అనేక యుగాలుగా తరాలుగా
మరుగుచేయబడిన మర్మం, కాని ఇది ఇప్పుడు పరిశుద్ధులకు
తెలియజేయబడింది.
27 యూదేతరుల మధ్యలో నుండి దేవుడు ఎన్నికచేసిన వారికి
ఈ మర్మం యొక్క సంపూర్ణ మహిమైశ్వర్యం ఎలాంటిదో, అనగా
మీలో ఉన్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై ఉన్నారనే విషయం
తెలియజేయబడింది.
28 మేము అందరిని సంపూర్ణులుగా క్రీస్తులో నిలబెట్టడానికి
సమస్త జ్ఞానంతో అందరికి ఆయన గురించే ప్రకటిస్తున్నాము,
హెచ్చరిస్తున్నాము, బోధిస్తున్నాము.
29 నాలో బలంగా పని చేస్తున్న క్రీస్తు శక్తి అంతటిని బట్టి,
ఇప్పటివరకు నేను ప్రయాసపడి పని చేస్తున్నాను.

# 2

1 మీ కోసం లవొదికయలో ఉన్న వారి కోసం, వ్యక్తిగతంగా నన్ను
కలుసుకొనని వారందరి కోసం నేను ఎంతగా కష్టపడుతున్నానో మీరు
తెలుసుకోవాలని ఆశిస్తున్నాను.
2 వారు క్రీస్తు అనే దేవుని మర్మాన్ని స్పష్టంగా తెలుసుకొని,
సంపూర్ణ గ్రహింపు అనే గొప్ప సంపదను కలిగి ఉండి, హృదయాల్లో
ధైర్యపరచబడి ప్రేమలో ఐక్యత కలిగి ఉండాలనేదే నా లక్ష్యము.
3 బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనలోనే దాచబడి
ఉన్నాయి.
4 ఇంపైన మాటలతో ఎవరూ మిమ్మల్ని మోసపరచకూడదని దీనిని
మీకు చెప్తున్నాను.

5 నేను శరీర విషయంలో మీకు దూరంగా ఉన్నా కాని, ఆత్మలో మీతో
కూడా ఉండి, మీరు ఎంత క్రమశిక్షణగా ఉన్నారో క్రీస్తులో మీ విశ్వాసం
ఎంత స్థిరంగా ఉందో చూసి ఆనందిస్తున్నాను.

## క్రీస్తులో ఆత్మీయ పరిపూర్ణత

6 కాబట్టి, మీరు క్రీస్తు యేసును ప్రభువుగా అంగీకరించినట్టుగా,
ఆయనలో వేరుపారి బలపడుతూ,
7 మీకు బోధించబడిన ప్రకారం విశ్వాసంలో స్థిరపడుతూ, మరి
ఎక్కువగా కృతజ్ఞతాస్తుతులను చెల్లిస్తూ, ఆయనలో మీరు జీవించడం
కొనసాగించండి.
8 క్రీస్తుపై కాకుండా, మానవ ఆచార సాంప్రదాయాలు ఈ
లోకసంబంధమైన మూల నియమాలపై ఆధారపడిన మోసకరమైన
వ్యర్థ తత్వజ్ఞానంతో ఎవరూ మిమ్మల్ని బంధించకుండా జాగ్రత్తపడండి.
9 ఎందుకంటే, పరిపూర్ణ దైవత్వం శరీర రూపంలో క్రీస్తులో
జీవిస్తుంది.
10 మీరు క్రీస్తులో పరిపూర్ణతలోనికి తీసుకురాబడ్డారు. సమస్త
బలానికి అధికారానికి ఆయనే శిరస్సు.
11 మానవ చేతులతో చేయబడని సున్నతిని క్రీస్తులో మీరు
పొందారు. క్రీస్తు చేత మీరు సున్నతి చేయబడినప్పుడు, మిమ్మల్ని
పరిపాలిస్తున్న మీ శరీర పాప స్వభావం కొట్టివేయబడింది.
12 ఏ విధంగా అంటే, బాప్తిస్మంలో మీరు ఆయనతో పాటు
పాతిపెట్టబడి, ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని క్రియలను
మీరు విశ్వసించుట ద్వారా ఆయనతో పాటు మీరు కూడా మృతులలో
నుండి లేచారు.
13 మీ పాపాలను బట్టి మీ శరీరం సున్నతి పొందని కారణంగా మీరు
చచ్చినవారిగా ఉండగా దేవుడు మిమ్మల్ని క్రీస్తుతో పాటు బ్రతికించారు.
ఆయన మన పాపాలన్నిటిని క్షమించారు,

14 మనకు వ్యతిరేకంగా ఉండి, మనల్ని శిక్షకు గురి చేసే
రుణపత్రాన్ని రద్దుచేశారు; ఆయన దానిని తీసివేసి, దానిని సిలువకు
మేకులతో కొట్టారు.
15 ఆయన సిలువ ద్వారా ప్రధానులను అధికారులను
నిరాయుధులుగా చేసి, వారు బహిరంగంగా సిగ్గుపడునట్లు చేసి,
సిలువ చేత వారిపై విజయాన్ని ప్రకటించారు.

## మానవ నియమాల నుండి విడుదల

16 కాబట్టి, మీరు తిని త్రాగే వాటి గురించి గాని, మతపరమైన
పండుగల గురించి అనగా అమావాస్య, సబ్బాతు దిన ఆచారాల
గురించి గాని మిమ్మల్ని ఎవరు తీర్పు తీర్చనివ్వకండి.
17 ఇవి రాబోవు వాటి ఛాయారూపమే, కానీ నిజమైన స్వరూపం
క్రీస్తులోనే ఉన్నది.
18 ఎవరైనా కపట వినయం ప్రదర్శిస్తూ, దేవదూతల పట్ల భక్తి
కనుపరుస్తూ మిమ్మల్ని అనర్హులుగా చేయకుండా చూసుకోండి.
అలాంటివారు తాము చూసినవాటిని గురించి గొప్పగా వివరిస్తూ
ఉంటారు; తమ బుద్ధిహీనమైన మనస్సు వలన వ్యర్థమైన
ఆలోచనలతో అతిశయపడతారు.
19 వారు శిరస్సు నుండి సంబంధాన్ని పోగొట్టుకుంటారు; అయితే ఆ
శిరస్సు వలన మొత్తం శరీరం కీళ్ళతో నరములతో ఒకటిగా అతుకబడి,
దేవుని వలన కలుగు వృద్ధితో అభివృద్ధి పొందుతుంది.

20 మీరు క్రీస్తుతో పాటు లోకం యొక్క మూల నియమాల విషయమై
చనిపోయినవారైతే, లోకానికి చెందినవారిగా, “చేతితో పట్టుకోవద్దు!
రుచి చూడవద్దు! ముట్టుకోవద్దు!”
21 అనే వాటికి మీరు ఎందుకు లోబడుతున్నారు?
22 ఉపయోగించి నశించడానికి నియమించబడిన ఈ నియమాలు
కేవలం మానవ ఆజ్ఞలు, బోధలపై ఆధారపడినవి.
23 అలాంటి నియమాలు, వారి స్వయంకృత ఆరాధన విషయంలో,
అతి వినయం విషయంలో, శరీరాన్ని హింసించుకోవడం జ్ఞానంగా

అనిపించవచ్చు, కాని శారీరక ఆశలను చంపుకోవడంలో అలాంటి
నియమాలకు ఎలాంటి విలువలేదు.

# 3

## క్రీస్తులో జీవం కలిగినవారిలా జీవించుట

1 మీరు క్రీస్తుతో కూడా లేపబడిన వారు కాబట్టి, పైనున్న వాటిపై మీ
హృదయాలను ఉంచండి, అక్కడ క్రీస్తు దేవుని కుడి వైపున కూర్చుని
ఉన్నారు.
2 భూసంబంధమైన వాటి మీద కాకుండా, పైనున్న వాటి మీదనే మీ
మనస్సులను ఉంచండి.
3 ఎందుకంటే, మీరు చనిపోయారు, కాబట్టి మీ జీవం క్రీస్తుతో కూడా
దేవునిలో దాచబడి ఉంది.
4 మీ జీవమై ఉన్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు, మీరు కూడా ఆయనతో
పాటు మహిమలో ప్రత్యక్షమవుతారు.
5 కాబట్టి మీ భూసంబంధమైన స్వభావానికి సంబంధించిన వాటిని
అనగా: లైంగిక దుర్నీతిని, అపవిత్రతను, కామవాంఛలను, దుష్ట
కోరికలను, విగ్రహారాధనయైన దురాశలను చంపివేయండి.
6 వీటి కారణంగానే దేవుని ఉగ్రత వస్తుంది.*
7 ఒకప్పుడు మీరు వీటి ప్రకారం నడుచుకొని జీవించారు.
8 కానీ ఇప్పుడైతే, మీరు కోపం, ఆగ్రహం, అసూయ, దూషణ, మీ
నోటితో బూతులు మాట్లాడడం వంటి వాటిని కూడా విడిచిపెట్టండి.
9 మీరు మీ పాత స్వభావాన్ని దాని అలవాట్లతో సహా విడిచిపెట్టారు,
కాబట్టి ఒకనితో ఒకరు అబద్ధాలు చెప్పవద్దు,
10 సృష్టికర్త స్వారూప్యంలోని జ్ఞానంలో నూతనపరచబడుతున్న
క్రొత్త స్వభావాన్ని మీరు ధరించుకున్నారు.
11 ఇక్కడ యూదులు అని యూదేతరులు అని, సున్నతి పొందిన
వారని సున్నతి పొందని వారని, అనాగరికులని నాగరికులని,

---

* **3:6** కొ.ప్రా.ప్ర.లలో అవిధేయుల మీదికి వస్తుంది

బానిసలని స్వతంత్రులని భేదం లేదు, క్రీస్తే సర్వం, అందరిలో ఆయనే
ఉన్నాడు.
12 కాబట్టి, పరిశుద్ధులును ప్రియమైన వారునైన దేవుని చేత
ఏర్పరచబడిన ప్రజల్లా మీరు జాలిగల మనస్సు, దయ, వినయం,
శాంతం, సహనం అనే వాటిని ధరించుకోండి.
13 ఎవరికైనా ఎవరిపట్లనైనా బాధ ఉంటే, ఒకరిని ఒకరు
సహించుకుంటూ ఒకరిని ఒకరు క్షమించుకోండి. ప్రభువు మిమ్మల్ని
క్షమించినట్లే మీరు కూడా క్షమించండి.
14 వీటన్నిటికి పైగా, పరిపూర్ణ ఐక్యతలో బంధించే ప్రేమను
ధరించుకోండి.
15 ఒకే శరీరంలోని అవయవాల వలె, సమాధానం కోసం మీరు
పిలువబడ్డారు, కాబట్టి క్రీస్తు యొక్క సమాధానం మీ హృదయాలను
పరిపాలించనివ్వండి. అలాగే కృతజ్ఞత కలిగి ఉండండి.
16 సంగీతంతో, కీర్తనలతో, ఆత్మ సంబంధమైన పాటలతో సమస్త
జ్ఞానంతో ఒకరికి ఒకరు బోధించుకుంటూ, హెచ్చరించుకుంటూ మీ
హృదయాల్లో కృతజ్ఞతతో దేవుని గురించి పాటలు పాడుతూ, క్రీస్తు
సువార్తను మీ మధ్యలో సమృద్ధిగా నివసింపనివ్వండి.
17 మీరు మాటల్లో కాని పనులలో కాని, ఏమి చేసినా ప్రభువైన
యేసు నామంలో చేయండి, తండ్రియైన దేవునికి ఆయన ద్వారా
కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ ఉండండి.

## క్రైస్తవ కుటుంబాలకు సూచనలు

18 భార్యలారా, మీ భర్తలకు లోబడి ఉండండి, అది ప్రభువులో
తగినది.
19 భర్తలారా, మీ భార్యలను ప్రేమించండి వారితో కఠినంగా
ప్రవర్తించకండి.
20 పిల్లలారా, అన్ని విషయాల్లో మీ తల్లిదండ్రులకు విధేయులై
ఉండండి, ఇది ప్రభువుకు ఇష్టము.

21 తండ్రులారా, మీ పిల్లల మనస్సు నిరుత్సాహపడేటట్లు వారికి
కోపం రేపకండి.
22 బానిసలారా, మీ భూసంబంధ యజమానులకు లోబడి
ఉండండి; వారి కనుదృష్టి మీమీద ఉన్నప్పుడు వారి దయను
పొందాలని కాకుండా చిత్తశుద్ధి గల హృదయంతో, ప్రభువుకు
భయపడుతూ అన్ని విషయాల్లో వారికి లోబడి ఉండండి.
23 మీరు ఏమి చేసినా, అది మనుష్యుల మెప్పు కోసం కాకుండా
ప్రభువు కోసం చేస్తున్నామని హృదయపూర్వకంగా చేయండి.
24 మీరు ప్రభువు నుండి స్వాస్థ్యాన్ని ప్రతిఫలంగా పొందుకుంటారని
మీకు తెలుసు కాబట్టి మీరు ప్రభువైన క్రీస్తునే సేవిస్తున్నారు.
25 తప్పు చేసినవారికి, వారి తప్పులను బట్టి తగిన శిక్ష
ఇవ్వబడుతుంది, ఇందులో ఎటువంటి పక్షపాతం ఉండదు.

# 4

1 యజమానులారా, పరలోకంలో మీకు కూడా యజమాని
ఉన్నాడని మీకు తెలుసు కాబట్టి, మీ దాసులకు సరియైనది
న్యాయమైనది ఇవ్వండి.

## మరిన్ని సూచనలు

2 కృతజ్ఞత కలిగి మెలకువగా ఉండి, నిరంతరం ప్రార్థన చేయండి.
3 నేను సంకెళ్ళతో ఉండడానికి కారణమైన క్రీస్తు మర్మాన్ని మేము
ప్రకటించడానికి, మా సువార్త పరిచర్యకు దేవుడు ద్వారాలను
తెరవాలని మాకోసం కూడా ప్రార్థన చేయండి.
4 నేను ప్రకటించవలసినంత స్పష్టంగా ప్రకటించడానికి నా కోసం
ప్రార్థన చేయండి.
5 ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సంఘానికి
బయటివారితో జ్ఞానంతో ప్రవర్తించండి.

6 మీ సంభాషణ ఎల్లప్పుడూ ఉప్పు వేసినట్లు రుచిగా కృపతో
నిండిన మాటలతో, అందరికి ఎలా జవాబు చెప్పాలో తెలిసిన వారిగా
ఉండాలి.

## చివరి శుభవచనాలు

7 తుకికు నా సమాచారాన్ని మీకు తెలియజేస్తాడు. అతడు
ప్రియ సహోదరుడు, ప్రభువులో నమ్మకమైన పరిచారకుడు నా తోటి
సేవకుడు.
8 మీరు మా స్థితి తెలుసుకోవాలని, అతడు మీ హృదయాలను
ప్రోత్సాహపరచాలనే ఉద్దేశంతో అతన్ని మీ దగ్గరకు పంపుతున్నాను.
9 అతనితో కూడా నమ్మకమైన ప్రియ సహోదరుడైన ఒనేసిము
వస్తున్నాడు, అతడు మీలో ఒకడు. ఇక్కడి సంగతులన్ని వారు మీకు
తెలియజేస్తారు.

10 నా తోటి ఖైదీలైన అరిస్తర్కుకు బర్నబాకు దగ్గరి బంధువైన
మార్కు మీకు వందనాలు చెప్తున్నారు. మార్కును గురించి మీరు
ఇంతకుముందే సూచనలు అందుకున్నారు, కాబట్టి అతడు మీ
దగ్గరకు వస్తే, అతన్ని చేర్చుకోండి.
11 యూస్తు అనబడే యేసు కూడా మీకు వందనాలు చెప్తున్నాడు.
దేవుని రాజ్యం కోసం నాతో ఉన్న జతపనివారి మధ్యలో, యూదులు
వీరు మాత్రమే ఉన్నారు. వీరు నాకు ఆదరణ కలిగిస్తున్నారు.
12 క్రీస్తు యేసు సేవకుడును మీలో ఒకడైన ఎపఫ్రా మీకు వందనాలు
చెప్తున్నాడు. మీరు పరిపూర్ణులుగా ప్రతి విషయంలో దేవుని
చిత్తం గురించి పూర్తి నిశ్చయతగలవారై స్థిరంగా ఉండాలని, ఇతడు
ఎప్పుడు మీ కోసం తన ప్రార్థనలో పోరాడుతూ ఉంటాడు.
13 ఇతడు మీ కోసం, లవొదికయలో హియెరాపొలిలో ఉన్న వారి
కోసం ఎంతో ప్రయాసపడుతున్నాడని ఇతన్ని గురించి నేను సాక్ష్యం
ఇస్తున్నాను.

14 మన ప్రియ స్నేహితుడు వైద్యుడైన లూకా, సహోదరుడైన దేమా
మీకు వందనాలు చెప్తున్నారు.
15 లవొదికయలో ఉన్న సహోదరి సహోదరులకు, నుంఫాకు ఆమె
గృహంలోని సంఘానికి నా వందనాలు తెలియజేయండి.

16 ఈ ఉత్తరాన్ని మీరు చదివిన తర్వాత, లవొదికయలోని
సంఘంలో కూడా చదివి వినిపించండి. అలాగే లవొదికయకు వ్రాసి
పంపిన పత్రికను మీరు కూడా చదివించండి.

17 అర్ఖిప్పుకు చెప్పండి: “ప్రభువు నుండి మీరు పొందిన
పరిచర్యను మీరు పూర్తి చేసేటట్లు చూడండి.”

18 పౌలు అనే నేను నా స్వహస్తంతో ఈ శుభములు వ్రాస్తున్నాను.
నా సంకెళ్ళను జ్ఞాపకముంచుకోండి. కృప మీతో ఉండును గాక.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6